# గోపాలం నాలిక్కరుచుకున్నాడు

"మీ కంగారుతో నన్ను కంగారుపెట్టి చంపుతున్నారు కదండీ!" నిద్ర లేచింది మొదలు నూటాపదహారవసారి భర్త మీద విసుక్కుంది సీతామాలక్ష్మి.

"విషయమేమిటో చెప్పు? టైమైపోతోందని నాకు దడగా ఉంటేనూ. నువ్వు మరింత హడల కొట్టించకు!" చిరాకు ప్రదర్శించాడు గోపాలం.

యాభై పదుల గోపాలం తెలుగు మాస్టారు. మహా కంగారు మనిషి అయిందానికి, కాందానికి అనవసరంగా కంగారు పడి పోతుంటాడు. ఆ కంగారులో  ఒకటి చేయబోయి మరొకటి చేస్తూ ఒకోసారి హాస్యాన్ని సృష్టిస్తుంటాడు.

"మీరిప్పుడు వెళ్లబోయేది టెన్త్ క్లాస్ స్పాట్ వాల్యూయేషన్‌కే కదా!"

సందేహాలు వలదు సతీమణీ! ముచ్చటగా మూడు దినములు గడిచినవి. మరొకమూడు, నాలుగు దినములు గడువవలసియున్నవి" అన్నాడు నాటకపక్కీలో.

"మరి కరీంనగర్‌కి ఎలా వెళ్లాలనుకుంటున్నారు?"

"ఏవిటా పిచ్చి ప్రశ్న? తల తిక్కగాఉందా! రోజూ బస్సులోనే కదా వెళ్లేది. అలాగే."

"బస్సులో వెళ్లక ఆంధ్రభోజరాజుగారు అరుదెంచుటకు పల్లకీ పంపుతారా? జోకులాపండి. ఈ అవతారంతో వెళ్తారా అని!"

"ఏ అవతారం?" క్వశ్చన్ మార్క్ ఫేసు పెట్టాడు.

"ముందటు పదండి" అంటూ భర్త చేయిపుచ్చుకొని సీతామాలక్ష్మి బెడ్రూమ్ వైపు లాక్కెళుతుంటే-

"రామ రామ! ఈ సమయంలో నీకిదేం విపరీతబుద్ధి సీతాలూ?" ముఖంలో సీరియస్‌నెస్ ఎక్స్‌ప్రెషనిస్తూ చేయి విదుల్చుకునే ప్రయత్నం చేశాడు.

కుదర్లేదు. ఉడుం పట్టు పట్టిందావిడ.

"చాల్లెండి సంబడం! పద్యం పాడవోయి హరిదాసూ అంటే కట్టుడు పళ్లూడుచుకునా తీసేశా? అనడిగాట్ట వెకనటికెవడో. అలా ఉంది తమరి వరస. ఎప్పుడు పడితే అప్పుడు మీతో సరసం కూడానా నా బ్రతుక్కి!?" నొసలు చిట్లించింది.

భర్తని డ్రెస్సింగ్ టేబుల్ ముందు నిల్చోబెట్టింది.

తన ఫుల్ సైజు ప్రతిబింబాన్ని అద్దంలో కళ్లారా చూసుకొని గోపాలం గతుక్కుమన్నాడు.

"ఇదెలా జరిగింది?" అనడిగాడు, తన ధోవతి వైపు ఆశ్చర్యంగా చూస్తూ, భార్యకి చూపిస్తూ.

"మరదేగా నేనిందాకట్నుండి మొత్తుకునేది! తమరి సహజసిద్ధమైన కంగారులో నామడి చీర కట్టుకున్నారు. అది కొన్నపుడే చెప్పాను. మీ పెద్దంచు ధోవతులకి దీనికి పెద్దగా తేడా లేదు వాపస్ ఇచ్చేయండని నా మాట విన్లేదు. ఇప్పుడేమో చీరని ధోవతిగా చుట్టేశారు. అచ్చం గంగిరెద్దుల వాడిలా ఈ అవతారం...!" అంటూ పక్కున నవ్వింది.

"ఇప్పటికే లేటయ్యిందంటే మళ్లీ ఇదొకటి నా ప్రాణానికి!" విసుక్కుంటూ దాన్ని విప్పేసి గబగబా ధోవతీ కట్టుకున్నాడు.

"పాపం రోజూ ఆ కుర్రాళ్ల పేపర్స్ ఎలా దిద్దుతున్నారో ఈ కంగారు మనిషి!" అని నిట్టూర్చింది.

నిలువు నామాల్ని మరో మారు అద్దంలో సరి చేసుకున్నాడు. తనకిష్టమైన పెద్దంచు ధోవతిని మురిపంగా చూసుకుని భార్యకి చెప్పి బయటపడ్డాడు గోపాలం.

ఇంటి నుండి ఫర్లాంగు దూరం నడిచి మెయిన్ రోడ్‌లో ఆటో ఎక్కి బస్ స్టాండ్‌కి చేరుకున్నాడు. 'జగిత్యాల ఆర్టీసీ బస్ స్టాండ్' అనే బోర్డ్‌ని హుందాగా పరికించి, స్టయిల్‌గా ముందుకి నడిచాడు. అతని అదృష్టం బావుండి కరీంనగర్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రెడీగా ఉంది.

వెయిట్ చేయించకుండా ప్రత్యక్షంగా ఉన్న బస్‌ని చూస్తూ ప్రసన్నవదనంతో కుడిపాదం మోపాడందులో. వెళ్లి ఖాళీగా ఉన్న ఓ సీటు నాక్రమించాడు.

వెంటనే ఆ బస్ కదిలింది. కండక్టర్, గోపాలం దగ్గరకొచ్చాడు.

"టికెట్... టికెట్...!" అనరిచాడు పక్కనే నిలబడి.

"గొంతు చించుకొని అంత గట్టిగా అరవడం దేనికయ్యా కండక్టరూ? నాకేమైనా చెవుడా?"

పర్స్ తీసి యాభై నోటందిస్తూ, "జగిత్యాలకి ఒక టికెటివ్వు" అన్నాడు గోపాలం.

నోటందుకోకుండానే "సారీ, సర్! ఇది జగిత్యాలకి పోదు" అన్నాడా కండక్టర్, జూ నుండి పారిపోయి వచ్చిన జంతువుని చూసినట్టు, గోపాలన్ని పైనుండి కింది, దాకా ఎగాదిగా చూస్తూ.

"మరి గోదారికి పోతుందా?" కళ్లద్దాల్లోంచి తొంగి చూస్తూ పల్లికిలించాడు. రైళ్లు, బస్సులు బ్రిడ్జి మీది నుండి నీళ్లల్లో పడ్డ సంఘటనలు గుర్తొచ్చి.

"ఏం ఫ్రీగా పుష్కరస్నానం చేసేద్దామనా? ఆశ దోశ! అక్కడికి అస్సలుపోదు!" అంటూ అడ్డంగా తలూపాడా కండక్టర్. గోపాలంతో బాతాఖానీ కండక్టర్‌కి సరదాగా ఉన్నట్టుంది.

తిక్కరేగింది గోపాలానికి.

"మరెటు పోతుందయ్యా?" అనరుస్తూ వాచీ చూసుకున్నాడు.

టైమ్ తొమ్మిది దాటింది. గంటం పావు ప్రయాణం. కానీ స్పాట్ వాల్యూయేషన్ సెంటర్లో తొమ్మిదింటికే హాజరవ్వాలి.

"కరీంనగర్‌కి" తాపీగా చెప్పాడు కండక్టర్.

'కరీంనగర్‌కి టికెట్' అనాల్సింది కంగారులో జగిత్యాలకని నోరు జారానన్న సత్యం అప్పుడు గ్రహించినవాడై, నాలిక్కరుచుకుంటూ-

"సర్సర్లేవయ్యా కుర్ర కండక్టరూ! ఆట పట్టించడానికి నేనే దొరికానా? కరీంనగర్‌కే ఇవ్వు టికెట్!" అంటూ ముసిముసిగా నవ్వాడు.

గోపాలం చేతిలోని యాభై నోటందుకొని "ఎన్నివ్వమంటారు?" అని అడిగాడు.

"అసలేన్ను నీకెలా కన్పిస్తున్నాను?" సర్రున గోపాలం స్వరం లేచింది.

"ఫుల్ టిక్కెట్టు లాగే కనబడ్తున్నార్లెండీ!" గొణిగాడా కండక్టర్ టికెట్ పంచ్ చేయకుండా.

'ఇంకా నయం నా హైటూ వెయిటుకి హాఫ్ టికెట్‌లా కనబడ్తున్నానని కామెంట్ చేయలేదు' లోలోన గోపాలం హాపీగా ఫీలవుతూ-- "ఎందుకా డౌటొచ్చింది?" అనడిగాడు శాంతంగా.

"ఇందుకు!" అంటూ తన చూపుల్ని కిందికి సారించాడా కండక్టర్.

అటు చూసిన గోపాలంకి విషయం బోధపడ్లేదు.

చిన్న కుర్రాడు గోపాలం కాళ్ల దగ్గర చేరి అతని ధోవతి అంచుతో ఆటాడుకుంటూ ఆనందిస్తున్నాడు.

"ఆ కుర్రాడు మీ తాలూకానేమో అనడిగా!"

పెద్దవాళ్లు తనని గమనిస్తున్నారన్న విషయం గ్రహించి, అక్కడి నుండి తుర్రుమన్నాడా పిల్లాడు. అటు పక్క సీట్లో కూర్చొని ఉన్న తల్లినిచుట్టేశాడు.

"ఇప్పుడు తెల్సిందిగా ఎవరి తాలూకో?" ధోవతిని సరి చేసుకుంటూ అన్నాడు గోపాలం.

టికెట్ పంచ్ చేసి మిగతా చిల్లర అందించాడు కండక్టర్. బస్సు దిగిన వెంటనే ఆటో పట్టి స్పాట్ సెంటర్‌కి చేరుకునేసరికి పదిన్నర దాటింది.ఒక ప్రైవేట్ స్కూల్లో స్పాట్ నిర్వహించబడుతోంది.

హడావుడిగా ఓ గదిలోకి చొరపడ్డాడు. అక్కడ తమ బాస్ అయిన కొత్త సీ.ఈ. కనపడ్డాడు.

'చుంచెలుక మొహం సీ.ఈ. కదా ఉండాల్సింది! ఈ పిల్లి కండ్ల సీ.ఈ ఉన్నాడేంటీ? నిన్నటి దాకా ఒక బాస్ ఈ రోజు నుండి మరొక బాసా, ఇదెలా?' అని ఆశ్చర్యపోయాడు గోపాలం.

సీ.ఈ. కి దగ్గరగా వెళ్లి ఐడెంటిటీ కార్డ్ చూపెట్టి, మారిన బాస్ వైపు మార్చి మార్చి చూస్తూ ఆన్సర్ షీట్స్ బండిలిమ్మని అడిగాడు.

"కుదరదు!" అన్నాడా సీ.ఈ. కిచ కిచమంటూ.

"ఎందుకని?" ప్రశ్నించాడు కనుబొమ్మలు ముడిచి.

"ఎందుకంటే... ఇది హిందీ సెక్షన్. తమరి తెలుగు సెక్షన్ పక్క గదిలో కాబట్టి" అన్నాడు. బొర్ర పైకీ కిందికి ఊగేలా పకపకా నవ్వుతూ.

గతుక్కుమన్నాడు గోపాలం.

బెంచీకి ఇద్దరిద్దరు చొప్పున కూర్చొని పేపర్స్ దిద్దుకుంటున్న మిగతా ఉపాధ్యాయ వర్గం ఘొల్లుమంది.

'గదులన్నీ ఒకేలా ఉండిచచ్చి కన్ఫ్యూజన్‌లో పడేశాయి. కంగారులో బయట బోర్డ్ కూడ చూడకుండా దూసుకురావడం తనదే పొరపా' టని రాకెట్‌లా వెనుదిరిగి గభాల్న పక్క గదిలో దూరాడు.

అక్కడ చుంచెలుక మొహం గుడ్లురిమి చూస్తోంది.

"ఏవయ్యా! ఈ జన్మలో టైమ్‌కి రావడం కుదరదా నీకు?" అంటూ విరుచుకు పడ్డాడు.

"అలా అనకండి సార్! రేపొక్క నాటిక్కూడా క్షమించండి" అన్నాడు అభ్యర్థనగా.

"ఈ ఒక్కనాటికా, రేపొక్కనాటికా?" సీ.ఈ తికమకగా చూశాడు. సరిగ్గా విన్నానో లేదోనని.

"మీరు విన్నది కరక్టేనండి. రేపు కూడా లేటు కావచ్చు అడ్వాన్స్‌గా అడుగుతున్నాను" అంటూ బాస్ చూపులకి సమాధానం చెప్పాడు.

మింగేలా చూస్తూ, "నువ్వు రాగానే నీ చేతిలో ఆన్సర్ షీట్స్ పెట్టకుండా లేటుకి ఆరాలు తీశాను చూడూ, అందుకు నన్ననాలి!" తన మీద తనే చిరాకు పడుతూ, ఇరవై ఆన్సర్ షీట్స్‌ని గోపాలానికి అందించి సైన్ చేయించుకున్నాడు.

గోపాలం పేపర్లందుకొని, తెలిసిన కో-అ2సిస్టెంట్ ఎగ్జామినర్స్‌కి విష్ చేస్తూ వెళ్లి సుబ్రహ్మణ్యశాస్త్రి పక్కన కూచున్నాడు.

కాసేపు ఇద్దరూ ఏం మాట్లాడుకోలేదు, మౌనంగా పేపర్ కరెక్షన్ చేయడంలో మునిగిపోయారు ఎవరికి వారే.

అరగంట గడిచాక సీ.ఈ. వచ్చాడు గోపాలం చెంతకు.

"దిద్దావా?" అనడిగాడు.

ఇవ్వబడిన పేపర్స్ నుండి రాండమ్ సిస్టమ్‌లో మొదట ఒక మూడు పేపర్స్ దిద్ది, ప్రతి ఒక్కరూ పరిశీలనకై సీ.ఈ.కి ఇవ్వాల్సి ఉంటుంది. వాటిని చూసి ఆయన ఓ.కే. అన్నాక మిగతా పేపర్స్ వాల్యూయేషన్ కంటిన్యూ చేయాలి.

"అ... అయిపోయింది సర్! వన్ మినిట్!" అంటూ దిద్దుతున్న పేపర్స్‌లోని మార్కుల టోటల్స్ చకచకా వేసి ఆయనకందించాడు.

సీ.ఈ. వాటిని తీసుకొని తన సీటు దగ్గరకు వెళ్ళిపోయాడు.

గోపాలం మరో ఆన్సర్ షీట్ ముందేసుకున్నాడు.

"శాస్త్రీ! వీడు రాసిన ఒక ఖాళీ చూడు. భలే గమ్మత్తుగా రాసాడు" తనలో తనే నవ్వుకుంటూ సుబ్రహ్మణ్యశాస్త్రితో అన్నాడు గోపాలం.

"చెప్పు" తలెత్తకుండా తన పని తాను కానిస్తూ అడిగాడు శాస్త్రి.

"తల్లిదండ్రులు పిల్లల్ని -తో చూస్తారు. ఈ ఖాళీని దయ అనే పదంతో పూరించాలి కదా!"

"అవును, తల్లిదండ్రులు పిల్లల్ని దయతో చూస్తారు అనేది వాక్యం"

"కాని వీడు తల్లిదండ్రులు పిల్లల్ని కళ్లతో చూస్తారు-అని రాశాడు.

ఫక్కున నవ్వాడు శాస్త్రి, చిరునవ్వును ఆపి "నేను దిద్దిన పేపర్స్‌లో ఓ పిల్లాడు వ్యతిరేకపదమొకటి తమాషాగా రాసాడు." అన్నాడు శాస్త్రి.

ఆసక్తిగా శాస్త్రి వంక చూశాడు గోపాలం.

"అమ్మకి వ్యతిరేకపదం నాన్నట"

"అవును మరి. వాడింట్లో అమ్మానాన్నలకి పడదేమో? అందుకని అలా రాసుకుంటాడు. అమ్మ, నాన్న పదాలు వ్యతిరేకపదాల కిందికి రావన్న ఇంగితం కూడా లేదు మొద్దు వెధవలకి!" శిష్యగణం మీద అక్షింతలు చల్లాడు గోపాలం.

శాస్త్రి తిరిగి పేపర్ దిద్దబోతుంటే-

"పాలు పోలేదు" అనే పదం ఉపయోగించి సొంతవాక్యం రాయమంటే ఇదిగో ఈ శిష్యరత్నం ఏం రాశాడో విను" అన్నాడు గోపాలం.

తలెత్తి వినసాగాడు శాస్త్రి.

"తెల్లవారింది. తలుపు చప్పుడయ్యింది. నాన్న వెళ్లి తలుపు తీసాడు. అమ్మ పనిలో ఉంది. నేను పాలు పట్టాను. పాలు పొయ్యి మీద పెట్టి అమ్మ తన పనిలో మునిగిపోయింది. కాసేపయ్యాక పాలు పొంగాయి. అమ్మ పరుగున వెళ్లిందక్కడికి. కానీ పాలు.. పోలేదు" కాస్త బిగ్గరగానే చెప్పి ముగించాడు.

అక్కడున్న వాళ్లంతా పేపర్స్ దిద్దడం ఆపి, మనసారా నవ్వుకున్నారు.

"పర్లేదు మేధావే కుర్రాడు!" అంటూ కామెంట్ విసిరాడు శాస్త్రి.

అందర్నీ నవ్వుల్లో ముంచెత్తిన గోపాలం బ్రేకిచ్చి. మరో పేపర్ దిద్దసాగాడు యమ సీరియస్‌గా.

సీ.ఈ. పరుగుపరుగున వచ్చి-" ఏవయ్యా గోపాలం!" పిల్చాడు కోపంగా.

"ఏం జరిగింది సార్? వినయంగా అడిగాడు.

"కొంప ముంచావు కదయ్యా!"

ఏదో జరిగి ఉంటుందని గోపాలం గ్రహించినవాడై అయోమయంగా చూశాడు బాస్ వంక.

"తెలుగు క్వశ్చన్ పేపర్‌కి మొత్తం మార్కులెన్ని?" సీరియస్‌గా అడిగాడు.

"భలే వార్సార్. ఏ విద్యార్థి నడిగినా చెప్తాడు వందని, దానికంత వర్రీ ఎందుకు?" అని స్టయిల్‌గా భుజాలెగరేశాడు.

"మరి ఈ పేపర్ చూడు. తమరు దిద్దిందేగా?" అంటూ ఇందాక గోపాలం దగ్గర తీసుకున్న పేపర్స్ లోంచి ఒక ఆన్సర్‌షీట్ చూపాడు సీ.ఈ

చూస్తూనే అదిరిపడ్డాడు గోపాలం. బుర్ర గిర్రున తిరిగింది. తల నీటిలో మునిగి శ్వాస ఆడని వాడిలా ఉక్కిరి బిక్కిరియ్యాడు ఆ పేపర్లో నూటికి, నూటా ఇరవై మార్కులు పడ్డాయి మరి!

"ఎందుకొస్తారయ్యా స్పాట్‌కి. విద్యార్థుల జీవితాలు నాశనం చేయడానికి కాకపోతే?" అంటూ అంతెత్తున ఎగిరాడు సీ.ఈ.

'మొత్తం మార్కులే వంద. నూట ఇరవై వేయడమేంటి. నా కంగారు కాకపోతే!' అంటూ తల పట్టుకున్నాడు గోపాలం.

మిగతా రెండు పేపర్స్ అతని మొహాన కొట్టి. చెక్ చేసుకొమ్మంటూ విసవిసా వెళ్లిపోయాడు సీ.ఈ.

విషయం తెలిసి మిగతావాళ్లు బిత్తరపోయారు.

ఇదెలా జరిగిందనుకుంటూ మరింత దిగులు పడిపోయాడు గోపాలం.

ప్రతి సంవత్సరం స్పాట్ పెట్టడం ఆ స్పాట్‌కి తనకి డ్యూటీ వేయడం-ఈ ప్రహసనం యమగండంలా తోస్తోంది గోపాలానికి.

దానిక్కారణం ఉంది. గోపాలం పడే కంగారు వల్ల ప్రతి సంవత్సరం ఏదో ఒక పొరపాటు దొర్లుతోంది. గత యేడాది ఇలాగే గోపాలానికి ఇచ్చిన ఆన్సర్‌షీట్స్‌లో ఒకటి మిస్సయ్యింది. ఇక చూడాలి హంగామా హడలిపోయాడు. అది దొరకేసరికి తలప్రాణం తోకకొచ్చింది.

"ఈ ఎగ్జామ్స్ సిస్టమ్‌నే మార్చి పారేసి ఉపాధ్యాయుల చేత పేపర్స్ దిద్దించే ప్రక్రియకి తిలోదకాలిస్తే బావుణ్ణు. ఇందుకు ఏ కంప్యూటర్‌నో ఉపయోగించుకుంటే పీడాపోయేది. మనకీ ఆందోళన తగ్గేది" తనకి తానే నచ్చచెప్పుకున్నాడు గోపాలం.

"నువ్వు విద్యాశాఖమంత్రి వయ్యాక ఆ పని చేద్దువు గానీ. కంగారులో అయిదు వేయాల్సిన ఆన్సర్‌కి పది, రెండు మార్కులు వేయాల్సిన చోట అయిదు వేశావేమో! ముందా పని చూడు!" సలహా పారేశాడు శాస్త్రి.

"ఏం పాడో ఏమో? నా ప్రాణానికొచ్చింది!" గొణుక్కుంటూ కళ్లద్దాల్ని సవరించుకొని, డిటెక్టివ్ లెవల్లో క్వశ్చన్ టు క్వశ్చన్ పరిశోధన మొదలెట్టాడు.

పది నిమిషాలు గడిచాయి.

"హమ్మయ్య! అలాంటి ప్రమాదమేం జరగలేదు. దేనికి వేయాల్సిన మార్కులు దానికి సరిగ్గానే వేశాను" అంటూ గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు.

"ఎక్స్ట్రాలు రాశాడేమో చూశావా?" క్లూ అందించాడు శాస్త్రి.

"భలే గుర్తు చేశావు! స్పాట్ మొదలైనప్పటి నుండి ఈ రోజు వరకు టీ తాగించమని నన్ను తెగ గీరుతున్నావు. నువ్వు తాగించడం తప్ప నేను తాగించలేదింతవరకు. ఈ అయిడియా ఇచ్చినందుకు ఈ రోజు తప్పక తాగిస్తాను." అంటూ యమ హుషారుగా పేపర్లోకి తలదూర్చాడు.

"టీ సంగతి తర్వాత. ముందా పేపర్ విషయం తేల్చుకో! మెమో ఇచ్చి గురుడు నీ సర్వీస్కి ఫైరంటిస్తాడు మరి!"

ఇరవై నిమిషాల పాటు పేపర్తో కుస్తీ పట్టాడు గోపాలం అటో ఇటో తేల్చేద్దామని.

అనంతరం-

"నిజమే శాస్త్రీ! వీడెవడోగాని ఘటికుడిలా ఉన్నాడు. ప్రతి సెక్షన్లో ఎక్స్ట్రాలు రాసి పడేసి నన్నే ఇరకాటంలో పడేశాడు. పట్టేసాను. కోస్తా, ఎక్స్ట్రాలు తెగ్గోస్తా" అంటూ స్టూడెంట్ రాసిన ఎక్స్ట్రాలన్నీ కొట్టేశాడు. తిరిగి మార్క్స్ కౌంట్ చేశాడు.

అంతే కంగు తిన్నాడు గోపాలం.

మార్కులీసారి హండ్రెడ్ బై హండ్రెడ్ వచ్చాయి. తెగాశ్చర్యపోతూ అదే విషయం శాస్త్రికి చేరవేశాడు.

"వందకి వంద వస్తున్నాయ్!" శాస్త్రి వైపు గాభరాగా చూశాడు.

గోపాలాన్ని చూస్తూ, "తెలుగు లాంగ్వేజ్ సబ్జెక్ట్. వందకి వంద రావడానికి ఏ మ్యాథ్సో, సైన్సో కాదుగా! విషయం బయటకి పొక్కితే ప్రెస్ కోడై కూస్తుంది. కామాల దగ్గరో, ఫుల్స్టాపుల దగ్గరో పట్టేసి మార్కులు నొక్కేసేయ్!" చెవిలో గుసగుసలాడాడు శాస్త్రి.

గోపాలం ప్రాణం ఉసూరుమంది.

"ఈ పేపర్ దిద్దడం నావల్ల కాదిక! పుణ్యముంటుంది. ఈరోజు హోటల్లో లంచ్ బిల్ నేనిస్తా గాని కాస్తిది చూసి పెట్టు" వేడుకున్నాడు గోపాలం.

"సరే"నని తలూపుతూ ఆ పేపరందుకున్నాడు శాస్త్రి.

ఇంతలో సీ.ఈ. వచ్చాడు.

"ఏమైంది గోపాలం? పేపర్ వ్యవహారం ఎందాక వచ్చింది?" అనడిగాడు.

బదులీయలేదు గోపాలం.

ఆన్సర్ షీట్ని తేరిపార చూస్తూ "చంపావ్ కదయ్యా గోపాలం!" అనరిచాడు శాస్త్రి.

"ఏం జరిగింది?" వంగి క్యూరియాసిటీగా తొంగి చూశాడు చీఫ్ ఎగ్జామినర్.

గోపాలం బిక్కుబిక్కుమంటూ చూస్తున్నాడు.

"ఇది స్టూడెంట్ రాసిన ఆన్సర్ షీట్ కాద్సార్!"

"మరి?"

"పేపర్స్ దిద్దడానికి గోపాలానికి మీరిచ్చిన 'కీ' పేపర్!" అంటూ బాంబ్ పేల్చాడు శాస్త్రి.

ముందస్తుగా ఆ విషయం గమనించని సీ.ఈ. కళ్లు బైర్లు కమ్మినయ్.

గోపాలం విరుచుకుపడిపోయాడు!

(13.02.2005)

❖